బి నాగేశ్వరరావు, ముక్కోట్ల

సావిత్రి లావుకధ : దేవిక ప్రేమకధ !

కాగడా

సంపుటి 3 12 th Year of Publication (New Series) సంచిక 5

12 పేజీలు ఏప్రిల్ '67 వెల: 25 పైసలు

శ్రీ నాగేశ్వరరావుకు తీవ్రగాయం

హీరో నాగేశ్వరరావుకు ఏప్రిల్ 3 న 'రహస్యం' షూటింగు సందర్భంగా చేతికి తీవ్రమైన కత్తి దెబ్బ తగిలింది. అరచేయి అరంగుళంలోతు తెగిపోయింది. చేతికి కట్టుతోనే విపరీతమైన బాధతో ఆయన హైద్రాబాద్ నుంచి బయలుదేరి వచ్చి 'ఆజ్ఞా' రజతోత్సవంలో పాల్గొన్నారు. షూటింగు పూర్తి అయేవరకూ తనకు అంత దెబ్బ తగిలినట్లుగా నిర్మాతలకు కూడా తెలియనివ్వలేదట ఆయన!



కుమారి రాధిక
పడగ విప్పిన పసిడి వయసు
తెలుగు పరిశ్రమను ఆకర్షించి తమిళ క్షేత్రకుల హృదయ కవాటాల్లో బుసలు కొడుతోంది!

రామారావు సాంఘికాలు

పెళ్ళి చేసి చూడు, సంసారం, మిస్సమ్మ, కలసివుంటే కలదు సుఖం, తోడు నీడ రాముడూ భీముడూ వగైరా ఎన్నో వున్నాయి, సాంఘిక చిత్రాలలో రామారావు ప్రజ్ఞ గురించీ స్థానం గురించీ చెప్పుకోవాలంటే. సాంఘిక ప్రయోజనం గల చిత్రాలంటే ఏమిటో చెప్పారు 'తోడు దొంగలు', 'పిచ్చి పుల్లయ్య' చిత్రాలు తీసి—

అటువంటి శ్రీ రామారావు రాను రాను ఎందుకో సాంఘికాలకు విరక్తుడుగా శర పరంపరగా జానపదాల వైపు మళ్ళిపోతుండడం మళ్ళిపోవడం అలాటిచిత్రాలకే తన నిర్మాతల్ని ప్రోత్సహించడం జరుగుతోంది. మంగళసూత్రం, అడుగుజాడలు వంటి చిత్రాలు కథాబలం లేకపోవడంవల్ల దెబ్బతిన్నాయి గాని రామారావు పనికిరాక కాదు. చెప్పుకోవాలంటే అనేక జానపదాలు కూడా గట్టిగానే దెబ్బతిన్నాయి. కాగా, సాంఘికాల్లో రామారావును శంకిస్తూ వచ్చే కొన్ని విమర్శలకు ఆయన గురిఅయిపోయి వాటికి మరింత దూరంగా పోతుండడం కనిపిస్తోంది. ఈ కువిమర్శలకు (పత్రికల్లో కాదు) లొంగకుండా రామారావు చిత్తస్థైర్యముతో మంచి మంచి సాంఘికాల్లో పని చెయ్యాలనీ—తనకూ దేశానికీ కూడా తద్వారా ప్రగతిని సృష్టించాలనీ అనేకసార్లు "కాగడా"ద్వారా తెలియజేశాం. అయినా, ఎందుకో ఆయన వైఖరిలో మార్పు కనిపించకపోగా, మరిన్ని జానపదాలు పెరిగిపోతుండడం విచారకరం.

అయితే, ఇందులో నిష్కల్మషంగా యిచ్చే ఒక చిన్న సలహాను కూడా శ్రీ రామారావు మన్నించాలి. సాంఘిక కథల్లో (తను నటించే చిత్రాల్లో) తగు బలం చూసుకుంటూ రొమాన్స్‌కు వీలైనంత స్థానం తగ్గించాలి. ప్రయోజనమూ వినోదమూ ఎక్కువ పాళ్ళలో వుంటే ఆయన నటించే సాంఘికాలు ఎక్కువ విజయాన్ని సాధిస్తాయి గుండమ్మ కథ, పెళ్ళిచేసి చూడు చిత్రాల స్థాయిలో. కొందరికి కొన్ని రకాల రసాలకు శరీర ప్రకృతి అడ్డు వస్తుంది. భారీ శరీరం కాని శ్రీ నాగేశ్వరరావే యింక తను రొమాన్స్‌లు (సినిమాల్లో) తగ్గించాలని ఆరాటపడుతున్నాడు. కాగా అది శ్రీ రామారావుకు మరింత ముఖ్యం. ఇది చూసుకుంటూ సాంఘికాలను బలంగల కథలతో తీయిస్తే (అవే ఎక్కువగా ఒప్పుకుంటూ) తప్పక దేశాన్నీ పరిశ్రమనూ ముందుకు నడపగలరు.

లేదంటే మళ్ళీ మనం వెనక్కే పోతున్నాం అనక తప్పదు.

కాదూ కూడదంటే ఒక జానపదానికి ఎంత ఖర్చవుతోందో ఆ ఖర్చుతోటే చక్కని పరమార్థంగల చారిత్ర్యకాలను నిర్మింపజేయవచ్చు. ప్రజ మెచ్చుతుంది. తిమ్మరుసుకీ, తెనాలి రామకృష్ణకూ, బొబ్బిలి యుద్ధానికీ డబ్బివ్వలేదా జనం? ఎన్ని జానపదాలు యీ మాత్రం డబ్బు కూడా రాబట్టలేక నష్టపోయి నిర్మాతల్ని వీధిలో నించోబెట్టలేదు?

కాగా, దేశాన్నీ పరిశ్రమనూ వెనక్కి కాకుండా ముందుకు నడిపించాలని ఆయన్నూ పరిశ్రమనూ కోరుతున్నాం.

—ఎడిటర్

నిర్దోషి చెత్త చిత్రమనీ సంగీతం బాగుండలేదనీ వ్రాసిన "చిత్ర జగత్" దేగా రాధాకృష్ణపై కోపంతో

అఫ్జా రజతోత్సవంలో ఘంటసాల చిందులు!

"ప్రతి ఘటన వస్తుందని నేను అప్పుడే అనుకున్నాం"— జస్టిస్ శ్రీ రామప్రసాదరావు వెల్లడి

అఫ్జా (ఆంధ్రా ఫిలిం జర్నలిష్టుల అసోసియేషన్) రజతోత్సవమంటూ ఒకటి జరుపుకుంది ఏప్రిల్ 4 న. పాత కార్య నిర్వాహక వర్గానికి తెలియకుండా కొత్త కార్య నిర్వాహక వర్గాన్ని ఒకదాన్ని ఏర్పాటు చేసుకుని (ఆరుగురు సభ్యులతో) ఇంటూరి యీ తదంగాన్ని 'ప్రొప్రయిటర్'లా జరిపించాడు. ఇంటూరి స్వభావానికీ అర్ధంలేని ఉత్సవాలకూ ఉద్యమాలకూ విసుగెత్తిన జర్నలిష్టులు కొందరు దీనికి దూరంగా వున్నారు. చాలామంది ముఖ్యులైన జర్నలిష్టులు రజతోత్సవాన్ని కూడా బహిష్కరించి దూరంగా వున్నారు. ఏదైనా జర్నలిష్టుల పేరుతో జరుగుతోంది గనుక పరిశ్రమలో సభ్యత కోసమైనా వెళ్ళడం మంచిదనుకుని కాగడా శర్మలాటివాళ్ళు కొంత సెంటిమెంటుతో వెళ్ళారు వాణీమహల్ కు. ఉత్సవం రోజు సాయంత్రం 6 గంటల వరకూ ముఖ్యులైన జర్నలిష్టులు ఎవరికీ ఎవరు ఏమి చేస్తున్నారో ఎలా జరుపబడుతున్నదో తెలియదు. అందుకే యింటూరి అస్సోసియేషన్ కు 'ప్రొప్రయిటర్'గా వ్యవహరించాడు అన్నాం.

రజతోత్సవంలో దాదాపు రెండువందలమంది వెటరన్స్ కు సన్మానాలు ఏర్పాటు చేసినట్టూ—టీపార్టీ వున్నట్టూ యిన్విటేషన్ కార్డును బట్టి మాత్రమే గ్రహించారు అనేకమంది జర్నలిష్టులు. ప్రొఫెషనల్ సెంటిమెంటుతో — పరస్పరం వున్న వ్యత్యాస భావాల్ని త్రోసిపుచ్చి అక్కడకు వెళ్ళిన జర్నలిష్టులకు—ముఖ్యంగా కాగడా శర్మకు అక్కడి ఏర్పాట్లు కొంత బాధ కలిగించాయి.

పాతికమంది పట్టే ఒక చిన్న రూములో బేచ్ బేచ్ లుగా టీపార్టీ! అదైనా వెటరన్స్ కు మాత్రమే. తక్కింగల ఆహుతులకు ఎవరికీ లేదు!

శ్రీ సి. పుల్లయ్య, పి. పుల్లయ్య, కామేశ్వరరావు, సి.ఎస్. రావు, వి. మధుసూదనరావు, ఆదినారాయణరావు, డి. మధుసూదనరావు, పి.ఎ.పి. సుబ్బారావు, శ్రీధరరావు వంటి నిర్మాతలూ దర్శకులూ విచ్చేశారు. అలాగే శ్రీ నాగయ్య, లింగమూర్తి, గుమ్మడి, రాజనాల, అక్కినేని నాగేశ్వరరావు, అంజలీదేవి, రాజసులోచన, గిరిజ, ఛాయాదేవి, ఋష్యేంద్రమణి వగైరా నటనటీమణులెందరో వచ్చారు. జర్నలిష్టుల సన్మానాలు అందుకోగోరిన అశేష ప్రముఖులూ (కొద్దిమంది మినహా) వచ్చారంటే వారందరూ 'ఆంధ్రా ఫిలిం జర్నలిష్టుల అసోసియేషన్'లో జర్నలిష్టులందరూ వుండి చేస్తున్నారనుకునీ - డిగ్నిఫైడ్గానే వుంటుందనుకునీ వచ్చారనడం నిర్వివాదాంశం.

ఒక పాత గదిలో బేచ్ తరువాత బేచ్ ని పంపి టీపార్టీ యివ్వడం అనేదీ—అందునా కేవలం సన్మానార్హతగల వారినే పార్టీలోకి పిలువడమనేదీ ఎంత సభ్యతాయుత విషయమో వేరే చెప్పనక్కర్లేదు. కేవలం ఫిలిం పరిశ్రమా—జర్నలిష్టులూ ఒక కుటుంబంగా కలసి వుంటున్నందునా—ఆహూతులకు ఏ బాధ కలిగినా జర్నలిష్టులందరికీ కూడా కళంకం అనుకున్నందునా సెంటిమెంటుతో అక్కడకు వెళ్ళిన కాగడా శర్మ ఆహూతుల్ని వీలైనంత గౌరవాదరాలతో చూసి అప్పటికప్పుడు తగు మర్యాదల్ని సృష్టించడం జరిగింది. ఇంక యీ మూక ఉమ్మడి సన్మానాలు ఎలా జరుగుతాయో భగవంతుడా అని బాధ కూడా ఏర్పడింది మనస్సులో.

సభకు యిద్దరు హైకోర్టు న్యాయమూర్తులు అధ్యక్షులుగానూ సన్మాన పత్రాలు బహూకరించే స్థానంలోనూ విచ్చేశారు. 200 సన్మాన పత్రాలచుట్టల్లో ఏ చుట్ట ఎవరిదో తెలియక తికమకలు పడుతూ మొత్తంమీద అందరికీ తలొకటీ అందించడం జరిగింది. వెటరన్స్ అందరికీ వేస్తూ జర్నలిష్టులు కూడా పరస్పరం దండలు వేసుకోవడం ఆదోలా కనిపించింది సభకు.

సన్మాన పత్రాలు అందుకున్నాక మొట్టమొదట శ్రీ నాగేశ్వరరావు ప్రసంగించారు. ప్రతిపక్షం బలంగా లేకపోతే ఏ ప్రగతీ వుండదంటూ ఆయన జర్నలిష్టులు తమ విమర్శలతో తనకూ, పరిశ్రమకూ ఎంత మేలు చేస్తున్నదీ వివరించారు. జర్నలిష్టుల జీవితాల్నిగురించీ వారి అభ్యుదయాన్నిగురించీ తను అప్పుడప్పుడు ఆరాటపడుతూ వుంటాననీ, ఫిలిం పరిశ్రమలో వారు కూడా భాగస్వాములేననీ అంటూ జర్నలిష్టుల అవసరాల్ని బాగోగుల్నీ గుర్తించవలసిన అవసరాన్ని పరిశ్రమకు ఉద్బోధించారు.

శ్రీ సి. ఎస్. రావు మాట్లాడుతూ కాగడా శర్మ వంటి జర్నలిష్టుల చురుకైన విమర్శలూ తన తండ్రిగారి (సి. పుల్లయ్య) శిక్షణా యీనాడు తనను యింత దర్శకుణ్ణిగా తీర్చిదిద్దాయన్నారు. శ్రీ నాగయ్య ఫిలిం జర్నలిష్టులకు హృదయపూర్వక కృతజ్ఞతలు చెప్పారు. శ్రీమతి అంజలీదేవి కూడా.

అసలే వేదికమీద 200 మందీ—హాల్లో 150 మందీ వున్న మహాసభ ఉపన్యాసాలు పూర్తి కావచ్చేటప్పటికి మరీ పల్చబడింది. రజతోత్సవం అంత బాగా ఆర్గనైజ్ చేయబడింది. దండలూ, సావనీరూ చూసుకున్నారే గాని యింటూరిలాటి ప్రొప్రయిటర్ నిర్వాహకులు జనం వచ్చే మార్గాలు ఆలోచించలేదు సభకు!!

ఇలాటి సభల్లో ఎవరో ఒకరు ఏదో ఒక రసాభాసు లేవదీస్తేతప్ప అందం లేదు గనుక (?) ఆపని శ్రీ ఘంటసాలా కాగడాశర్మా పూర్తి చేశారు చివరి క్షణాల్లో. శ్రీ ఘంటసాలను గురించి యిటీవల ఎవరో ఒక జర్నలిష్టు "చెత్త"గా వ్రాశాడట. ఒక చిత్రాన్ని గురించి "దరిద్రంగా" వ్రాశాడట. ఆయనకు ఆ జర్నలిష్టుమీద వున్న అక్కసు సభా వేదికను కలుషితం చేసేంతవరకూ తెచ్చింది. వివరం చెప్పకుండా, పేరు చెప్పకుండా ఆయన జర్నలిష్టులను తూర్పారబట్టడం సాగించాడు. ఆయన మాట్లాడుతున్నది ఎవర్ని గురించీ అన్నది తెలియక జర్నలిష్టులంతా ముఖముఖాలు చూసుకోవడం మొదలుపెట్టడం ప్రారంభమైంది. కాగడా శర్మ వేదికమీదకు లంఘించి ఆవిధంగా మాట్లాడడం తప్పనీ, సభా వేదికనూ సన్మాన గౌరవన్ని కళంకపరచడం మర్యాద గాదనీ, గట్స్ వుంటే ఆ జర్నలిష్టు పేరు చెప్పి మాట్లాడడం మంచిది గాని అందర్నీ కలిపి అనడం బాగుండలేదనీ విజృంభించడంతో — ఆ వాగ్వాదాల రణరంగంలో శ్రీ నాగయ్య కామెడీగా "జన గణ మన" పాడించేసి పర్యవసానాన్ని నిరోధించారు.

మింగ మెతుకు లేకపోయినా మీసాలకు సంపెంగనూనె సామెతగా వుంటాయి కొందరు ఫిలిం జర్నలిష్టుల చర్యలు. ఇంటూరి సన్మానాల పిచ్చీ—మూక ఉమ్మడి సన్మానాల పిచ్చి యీనాటిది కాదు. ఇలాటి తదంగాలు పెడుతూ వుండడమూ సన్మానితులలో ఎవరిచేతో ఏ చివాట్లో జర్నలిష్టులందరికీ సంక్రమింపజేసి తాను మాత్రం "సభా మర్యాద" పేరుతో నోరు మెదపకుండా చక్కాబోతుండడం యీయనకు అలవాటు. ఇది మొదటిసారి కాదు—

సన్మానాలకనీ, ఉత్సవాలకనీ ఏదో రూపంగా ఫిలిం పరిశ్రమలోనివారినుంచి డబ్బు తేవడమూ ఆ డబ్బుతో తదంగాలు జరపడమూ, డబ్బు యిచ్చాము గదా అన్న ధీమాతో హోదాతో వాళ్ళు అనే మాటలూ యీసడింపులూ పడడమూ ఏమంత గౌరవప్రదం కాదు!

ఫిలిం పరిశ్రమలోని అనేకమంది ఎవరి వృత్తి వాళ్ళు చేసుకుంటున్నట్టే జర్నలిష్టులు కూడా తమ మానాన తమ వృత్తి తాము చేసుకోవడం మంచిది గాని యిలాగ కొరివి పెట్టి తల గోక్కుంటూవుండడం మంచిది కాదు. ఇది మొదటిసారి కాకపోయినా ఆ స్వభావం ఏర్పడలేదు అసోసియేషన్ ప్రొప్రయిటర్ ఇంటూరిలో!

జర్నలిష్టులు సర్వజ్ఞులు కారు. పొరబాట్లు వారిలోనూ వుండచ్చు. ఎవరైనా బాధపడే వ్యక్తులుంటే వారు వారి భావాల్ని పత్రికలకు వ్రాయవచ్చు. జర్నలిష్టుల్ని విమర్శించవచ్చు. బాధ్యతా వ్యక్తిత్వమూ గల జర్నలిష్టులు ఆ అవకాశాన్ని యిచ్చితీరుతారు ఎవరికైనా.

కాని, యిద్దరు హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్న సన్మాన సభా వేదికను 'రచ్చబండ'గా మార్చడం ఎవరికీ ధర్మం కాదు. ఘంటసాల తొందరపడితే కాగడా శర్మా తొందరపడి వెంటనే జవాబు యిచ్చేశాడు. సభా మర్యాద తెలిసినవాళ్ళు అందుకు విచారపడకుండా వుండలేరు. కనుకనే కాగడా శర్మ ఆ మర్నాడు జస్టిస్ రామప్రసాదరావు, జస్టిస్ కృష్ణస్వామి రెడ్డి గార్లను స్వయంగా కలుసుకుని తన విచారాన్ని ప్రకటించి వచ్చాడు. తద్వారా సినిమా జనంమీద న్యాయమూర్తులకు యేర్పడ్డ అపోహను తొలగించడం కూడా తటస్థపడింది.

జస్టిస్ రామప్రసాదరావు తమ యింట్లో ముచ్చటిస్తూ "ఘంటసాల గారు తీవ్రంగా మాట్లాడుతున్నప్పుడే అనుకున్నాను ఏదో ప్రతిఘటన రావచ్చునని. అలాగే మీరు లేచారు. అది మామూలే" అన్నారు నవ్వుతూ.

జస్టిస్ కృష్ణస్వామిరెడ్డిగారు చాలా సాదరంగా వాత్సల్యంతో ముచ్చటిస్తూ "అలాటి బాధేమీ లేదు—ఎప్పుడు ఏ ఫంక్షన్స్ వున్నా పిలవండి వస్తాం" అన్నారు,

"సన్మాన వేదికలు (సినిమా ఫీల్డులో) అభిప్రాయ వేదికలు కాకుండా మసులుకోవడం సర్వులకూ ధర్మం" అన్నారు. అనేకమంది ఫంక్షన్ తర్వాత—

ఎడిటర్స్ మెయిల్

స్థలాభావం వల్ల యీసంచికలో ఎడిటర్స్ మెయిల్ (ప్రశ్నలు—జవాబులు) శీర్షిక ప్రచురించలేకపోయాం. వచ్చే సంచికలో తప్పకుండా వుంటుంది.

అది గాక పాఠకుల ప్రశ్నలకు హీరో హరనాథ్ జవాబులుకూడా వచ్చే సంచికలోనే ప్రచురించగలం. ప్రశ్నలు హరనాథ్, C/o కాగడా, 3 సుందరం అయ్యర్ స్ట్రీట్, మద్రాసు–17"కు పంపవచ్చును.


—ఎడిటర్

ఆంధ్ర పత్రిక వ్యాఖ్య!

రజతోత్సవంలో ....

శ్రీ అక్కినేని నాగేశ్వరరావు మాట్లాడుతూ లోపాలను విమర్శించడం సహజమేనన్నారు. ఫిలిం జర్నలిస్టుల కర్తవ్యాన్ని మెచ్చుకొన్నారు. వారి పట్ల తమ కెప్పుడూ గౌరవ భావమే కలదన్నారు...శ్రీ వి. నాగయ్య ప్రసంగిస్తూ కళాకారుడు ఎల్లప్పుడూ జీవించే వుంటాడని వారు నిత్య యౌవనులనీ అన్నారు...అయితే యీ ఉత్సాహానికి తగు ప్రోద్బలమూ ప్రోత్సాహమూ కల్పించేది ఫిలిం జర్నలిష్టుల కలమేనని వివరించారు....శ్రీ సి. ఎస్. రావు మాట్లాడుతూ విమర్శ అనేది జర్నలిష్టుల హక్కు అన్నారు—కళాకారులను ముందుకు నడిపించే సాధనసామగ్రి వారి చేతులలో కలదని గుర్తించాలని సూచించారు......శ్రీ ఘంటసాల మాట్లాడుతూ ఫిలిం జర్నలిజంలోని కొన్ని చాకబారు పోకడలను పేర్కొని వాటిపై తీవ్ర విమర్శ గావించారు......శ్రీ పేకేటి శివరాం మాట్లాడుతూ ఫిలిం పరిశ్రమకు కళాకారులకు విమర్శకులు ఎంత ఘనంగా సేవ చేసినదీ మున్ముందు చరిత్రలో చదువుకోగలరని చెప్పారు. శ్రీ కె. కామేశ్వర శర్మ శ్రీ ఘంటసాల విమర్శలకు సముచితమైన సమాధాన మిచ్చారు.

6-4-67 ఆంధ్ర పత్రిక



రాజసులోచన

నాట్యకళా సరస్వతికి ప్రతిరూపం

శ్రీ ఘంటసాలపై ఒక విమర్శ!

సంగీతాన్ని విమర్శిస్తే తప్పా?

ఇటీవల మద్రాస్ వాణీమహల్లో జరిగిన ఆం॥ ఫి॥జ॥ రజతోత్సవ సందర్భంలో శ్రీయుతులు పద్మశ్రీ నాగయ్య అక్కినేని నాగేశ్వరరావు, దర్శకుడు సి.ఎస్. రావ్ (బి. యే. లిట్) లు మాట్లాడ్తూ ఫిలిం జర్నలిస్టులు చాలా కాలంగా సినీ పరిశ్రమకు సల్పిన అపార కృషిని కొనియాడారు. తామీనాడీ సాయికి నిలబడ్డానికి కారణం పత్రికా రచయితల ఘాటైన విమర్శలని అన్నారు. శ్రీ అక్కినేని మాట్లాడ్తూ అసెంబ్లీలో కాని పార్లమెంటులో గాని, మరే యితర రంగాల్లో గాని ఎదురుకక్షి లేందే ఒక వర్గంవారికి పట్టుదల దీక్ష పెరగవని అటువంటి రోషాన్ని కల్పించడానికీ వారీనాడు

శ్రీ సి. గోపాలకృష్ణ (కళావాణి)

తారపథంలో వుండటానికి బాధ్యులు పత్రికలన్నారు. పత్రికలు వారికి తల్లి దండ్రుల వంటివనే ధృడ విశ్వాసం ఆయనకు కలదన్నారు.

శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావ్ మాట్లాడుతూ ఇటీవల ఆయన పనిచేసిన ఒక చిత్రం గురించి ఒక పత్రిక ఆయన కూర్చిన సంగీతాన్ని విమర్శించిదనీ, ఈ విమర్శలు పత్రికల్లో విమర్శించకుండా ముఖాముఖీ వారివద్దకు వెళ్ళి చెబితే సరి చూచుకుంటామని అన్నారు. "ఈ సంగీతం చెత్త"—"ఈ చిత్రంలోని సంగీతం ఘోరం" అని వ్రాసి తన జీవనోపాధికి భంగం కల్గించకూడదన్నారు.

వారి ఉద్రేకపూరితమైన అసందర్భపు ఉపన్యాసానికి సమాధానం చెప్పటానికి వెంటనే కాగడా పత్రికా సంపాదకులు శ్రీ కె. కె. శర్మ వేదికపైకి వెళ్ళి ఏదో ఒక పత్రిక విమర్శించిందని ఇదమిదంగా చెప్పడం సబబనీ, ఏ పత్రికలో వ్రాసిందీ "గట్స్" ఉంటే వేదికపై బహిరంగంగా చెప్పిఉండాలని ఉపన్యాసధోరణిలో చెబుతూండగా, సదరు ఘంటసాల ఆడిటోరియంలో నుండి లేచి "దేగా...దేగా" అంటూ నినదించారు ఆడిటోరియంలో కదం తొక్కుతూ సభను భీభత్సం చేశారు.

ఆయనకు వేదిక పైకెక్కి మాట్లాడిన సందర్భాన్నిచ్చిన అవకాశాన్ని పురస్కరించుకొని, ఎవరో ఒక పాత్రికేయుడు చేసిన విమర్శలు కూడదంటూ మిగతా జర్నలిస్టులందరిని ఉప్పతూ, ఏవేవో మాట్లాడ్డానికీయన కధికారం లేదు. ఇది శుద్ధ అసందర్భం అసమంజసం. ఆనాటి ఆయన బాధ్యత వేదికపై వారికి జరిగిన సన్మానానికి కృతజ్ఞత తెలుపుకోవడమే కాని ఒకరినొకరు విమర్శించుకోవడానికి, ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తుల సమక్షంలో వేదికపై వాదోపవాదాలు సల్పుకోవడానికి తావు కాదు.

శ్రీ ఘంటసాల ప్రసంగానంతరం శ్రీ కాగడా శర్మ వేదికపై మాట్లాడే సమయంలో తాను ఆడిటోరియంలో చిందులు తొక్కుతూ సభను రసభాస చేసి అక్కడ చేరిన కళాలోకాన్ని భీభత్సం చేయడం సభా మర్యాదకు భంగం - కాగడా శర్మను పూర్తిగా మాట్లాడనిచ్చి ఆపై తాను అధ్యక్షుని అనుమతితో వేదికపైకెక్కి సమాధానం చెప్పడం విజ్ఞానంగల సభా మర్యాద తెల్సిన కళాకారుని కనీసధర్మం. ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులు వేదికపై అలంకరించి ఉండగా ఆడిటోరియంలో నుండి గాండ్రుకేకలు పెట్టడం, ఆనాటి కార్యక్రమ నిర్వాహకుల అనుమతి లేకుండా సభను భీభత్సం చేయడం చాలా అసభ్యతను బుజువు పర్చింది. కళాకారుల సన్మానవేదిక అంటే ఎవరింట్లోనో పెళ్ళికి పాటలు పాడుకునే బల్లల పందిరి కాదని తెలుపవలసిన అవసరం ఉంది ఈ సందర్భంలో—

ఇంతకూ ఈ అధిక ప్రసంగానికి కారణం నెల్లూరు పత్రిక "చిత్రజగత్" లో దాని సంపాదకుడు దేగా రాధకృష్ణ మార్చిలో విడుదలైన "నిర్దోషి" చిత్రంలోని సంగీతం "ఘోరం" అని వ్రాయడమే!! "లోకోభిన్నరుచిః"— అది ఆ పత్రికా సంపాదకుని అభిప్రాయంగా వెలిబుచ్చాడు. అది కాదనానికితనికధికారం లేదు. అదే సంపాదకుడు పూర్వం ఘంటసాల సంగీత దర్శకత్వం నిర్వహించిన పూర్వపు చిత్రాలను గురించి మంచిగా ఎలా వ్రాయగల్గాడు? ఎందుకు వ్రాశాడు? ఈనాడు నిర్దోషి చిత్రంలో సంగీతం ఘోరం అనెందుకు వ్రాయవలసి వచ్చింది? ఇది ఆలోచించుకుంటే ఘంటసాల నాటి సభలో చిందులు త్రొక్కే పనిలేకపోయేది.

ఈ సందర్భంలో ఒక సత్యాన్ని చర్చించక తప్పదు. ఘంటసాల ఇంతవరకు 200 చిత్రాలకు పైగా పని చేశారు. మొత్తం రాగాలన్నీ కలిపి 200 లేవు. అందులోనూ వాడుకలో నుండే రాగాలు చాలా తక్కువ. సంగీత శాస్త్రంలో ఉన్న రాగాలకన్న ఘంటసాల పనిచేసిన చిత్రాల సంఖ్య ఎక్కువ. అట్టి సందర్భంలో "పాడినదే పాటరా - పాచిపళ్ళ దాసరీ" అన్నట్టు ఒకసారి వినిపించిన రాగాలూ ట్యూన్సే చాలవరకు చెవులకు ప్రతిధ్వనిస్తున్నాయి. ఇః ప్రత్యక్షంగా కనపడే సత్యం - దీనిని ఘంటసాల కాదు గదా గారి నాథుడు కూడా ఒప్పుకోక తప్పదు. పాత చింతకాయ పచ్చడే పిక్చర్లలో ప్రత్యక్షమయ్యేటపుడు దానిలోని విషయాన్ని విమర్శించడంలో అతిశయోక్తి ఏముంది?

ఇటీవల 1966 సం॥లో నామరూపాలు లేకుండాపోయిన "శకుంతల" యింకా మరి కొన్ని చిత్రాలకూ సంగీత దర్శకుడు యీ ఘంటసాల. ఇటీవల విపరీతమైన నష్టాన్ని పొందిన నిర్దోషికి కూడా యీ మహానుభావుడే సంగీతం— పూర్వ చరిత్ర తరచి చూస్తే ఆనాటి రోజులు మారాయి, బాలరాజు, విప్రనారాయణ, మల్లీశ్వరి వంటి చిత్రాల్లో కథాసారాంశం అంతగా లేకపోయినా కేవలం పాటలకొరకే అఖండ విజయాన్ని సాధించాయి "ఏరువాకా సాగాలోయ్" పాట ఈనాటికీ ప్రతిధ్వనిస్తూంది ప్రేక్షకుల్లో — స్వర్గసీమలోని "ఓ హో హో పావురమా" ఎవ్వరూ మరువలేరు. త్యాగయ్య పోతన చిత్రాల్లోని సంగీతాన్ని కొన్ని తరాలవరకూ మరచిపోలేం. ఘంటసాల సంగీత దర్శకత్వం వహించిన చిత్రంలోని పాటలు ఏ ఒక్కటైనా మచ్చుకి ఈ రోజువరకూ ఫలానా ఔచిత్యాన్ని బుజువు పరచిందా? కమ్మగా పాడడం వేరు, ట్యూన్ తయారుచేసి మెప్పించడం వేరు. తాను సంగీత దర్శకత్వం వహించి అపజయం పొందిన చిత్రాలు ఏ కొద్ది రోజులైనా పాటలకోసం నడిచి వుంటే, తన సంగీతానికి ప్రాముఖ్యాన్నల్లు

(మిగతా చివరి పేజీలో)

KAGADA **APRIL '67** **Regd. No. M 7567**
Certified by the Registrar of News Papers. The Ministry of I. B. Govt. of India as No. 8223/57

గృహ లక్ష్మి


సింపుల్‌గా చాలా చిన్న కథ. కొడుకు బాగా చదువుకోవాలన్న కోరికతో కోడల్ని మేడమీదకు వెళ్ళకుండా చేస్తాడు మామగారు. ఆ మామగారికి కొడుకుమీదకంటె ఎక్కువ ప్రేమ కోడలిమీద. కాని ఏం చేస్తాడు? అబ్బాయి శ్రద్ధగా చదువుకోవాలంటే అమ్మాయి కనబడకూడదాయె! ముద్దుకీ ముచ్చటకీ కరువాచిపోయిన అబ్బాయీ అమ్మాయిలు అమ్మాయి పోదరుడిచ్చిన దొంగ టెలిగ్రాం ఆధారంగా అమ్మాయి తల్లికి జబ్బు చేసిందని యింట్లోంచి చెక్కేస్తారు. నాలుగు రోజులపాటు హోటల్లో మకాం. అక్కడ నానా గొడవా! చివరికి యింటికి చేరేప్పటికి కథంతా బయటపడిపోతుంది మామగారికి. హాయిగా యిద్దర్నీ కలిసి మేడమీదకి పొమ్మంటాడు. ఇదీ కథ. అడుగడుగునా అతి చక్కని సున్నితమైన హాస్యరస పరిపోషణతో గొప్ప ప్రహసనంగా రెండున్నర గంటలపాటు చూసేలా విసుగు లేకుండా సాగిపోయింది ట్రీట్ మెంటు — ప్రొడక్షన్ ఖర్చు ఆట్టె కాకుండా.

భానుమతి చిత్రాలన్నిటిలాగే యిందులో కూడా ఆవిడ కళ్ళూ ముక్కూ నోసలూ పళ్ళూ పెదవులూ ఒళ్ళూ అన్నీ కూడా అతి సమర్థంగా నటించాయి. చూడ ముచ్చటగా ముద్దుగా బంగినిపల్లి మామిడి పండులా ఘుమ ఘుమలు చిమ్మింది తెర నిండుగా దండిగా. ఆవిడలాగే, ఆవిడ పాడిన మూడు నాలుగు పాటలూ ఆ గొంతూ మురిపాలు మూటగట్టాయి. ఎస్. రాజేశ్వరరావునుకూడా మెచ్చుకోక తప్పదు. నాగేశ్వరరావు బాగా చేశాడు. కాని, భానుమతిముందు పల్చబడకుండా కనిపించడం సాధ్యం కాదు ఎవరికీ. పద్మనాభం కామెడీలో కొత్తదనం కనిపించి సంతృప్తి కలుగుతుంది జనానికి. భానుమతి అత్తమామలుగా సూర్యకాంతం-రంగారావు సరేసరి — యిలాటి పాత్రలకు పెట్టింది పేరుగా పేరు తెచ్చుకుంటారు. రమణారెడ్డి, రామలింగయ్య, రాజుబాబు, రావి కొండలరావు వగైరాలు తమ తమ ప్రతిభల్ని పూర్తిగా చూపించారు. మంచి సత్కాలక్షేపాన్ని సృష్టించిన దర్శకుడు రామకృష్ణను అభినందించకుండా వుండలేం —

(11 వ పేజీ తరువాయి)

ఖర్చుపెట్టిన డబ్బయినా సంపాదించుకోగల్గి వుండేవారు. ఆ విద్వత్తును గాని, పరిశ్రమకు ప్రేక్షకులకు ఉపకరించే విద్యను చూపలేని స్థితిలో గాని, ఒక వ్యక్తిలోని శక్తి సడలిపోయిన తరువాత విమర్శకు గురికాక తప్పదు. చిత్ర విజయానికి సంగీత ప్రజ్ఞ తోడుపడకపోవడానికి కారణమే సంగీత దర్శకుని అసమరత. విమర్శించారని విశ్రవీగేకన్నా విమర్శకు తావీయకుండా పనితనం ప్రదర్శించడం విజ్ఞానవంతుల లక్షణం.


నేడు పరిశ్రమలో మహదేవన్, విశ్వనాథన్ రామమూర్తివంటి తమిళ సంగీత దర్శకులను తెలుగు నిర్మాతలు అన్వేషించి, "మూగ మనసులు" చిత్రంవంటి చిత్రాల సంగీతంతో ప్రజలకు హాయిని కల్పించిందంటే — దీనికి సదరు ఘంటసాల సమాధాన మేమిటి? దీనికి పత్రికలవారిని బాధ్యులుగా కన్వరచి శివతాండవం చేయడం కుప్పదండుగ. ఇటీవల రికార్డింగ్ ముందు ఆఫీసుల్లో రిహార్సల్సు చేసే స్థితినుండి యీయన పాడేపుడు కలిగే ఆయాసానికి కొందరు నిర్మాతలు అధికధనం వ్యయపరచి వ్యయ ప్రయాసల్తో యీయన పాటలు రికార్డింగ్ చేయవలసి వస్తూందనే వార్తలు వినబడుతున్నాయి. ఇటువంటి సందర్భములో శ్రీ ఘంటసాల సంపాదించిన కీర్తిని చిరస్థాయిగ కాపాడుకోడానికి ప్రయత్నించాలి తప్ప, బండి వేరే రూటులో పడిందంటే ప్రయాణాన్ని వేరే పట్టాలపై సాగిస్తుంది నేటి (వి) చిత్ర పరిశ్రమ! *



విజయశ్రీవారి 'పాండవుల బాల్యకథ' షూటింగు ప్రారంభోత్సవంలో — నిర్మాతలు శ్రీ సూర్యనారాయణరాజు, హనుమంతరావు, దర్శకుడు సుబ్రహ్మణ్యం, రచయిత జూ॥ సముద్రాల, చందమామ అధినేత శ్రీ డి. ఎల్. వగైరాలు.



'పాండవుల బాల్యకథ' ప్రారంభోత్సవంలో — శ్రీమతి అంజలీదేవి (కుంతి), క్లాప్ కొట్టడానికి వచ్చిన శ్రీ ఎన్. టి. ఆర్, శ్రీమతి జి. వరలక్ష్మి (గాంధారి), సీనియర్ సముద్రాల, దర్శకుడు శ్రీ సుబ్రహ్మణ్యం, జూ॥ సముద్రాల, స్విచ్ ఆన్ చేసిన శ్రీ పూర్ణా కామరాజు వగైరాలు.



దర్శకులు శ్రీ సుబ్రహ్మణ్యం శ్రీమతి అంజలీదేవిని సెట్‌లోకి ఆహ్వానిస్తున్న చిత్రం.

రాజసులోచన కూచిపూడి నృత్యం!

ఆంధ్రుల అభిమాన రంభ కూచిపూడి నాట్య తార శ్రీమతి రాజసులోచన మార్చి 28న తూర్పు గోదావరి జిల్లా చొప్పెల్లలో రమారమి 50 వేలమంది జనానీకంలో అపూర్వ నాట్య ప్రదర్శన యిచ్చి వచ్చింది — కాగడా మిత్రులు శ్రీ నాగిరెడ్డి గంగరాజు వివాహ సందర్భంగా. రాజమండ్రిలో ఆమెకూ, ఆమె బృందానికీ (బేబీ పద్మిని, కుమారి తంగం, కుమారి సరోజ వగైరా) పుర ప్రముఖులు శ్రీ అవధానుల వెంకటేశ్వర్లు, శ్రీ చిన్నరెడ్డి, శ్రీ సూరి అప్పారావు వగైరాలు స్వాగత సత్కారాదికాలు సమకూర్చి ఆతిథ్య మిచ్చారు. రాజసులోచనకు స్వాగతంగానూ వీడ్కోలుగానూ చొప్పెల్లవాసులు విపరీతమైన బాణసంచాతో అట్టహాసం చేశారు. పోలీసు బందోబస్తు అవసరం లేకుండానే 50 వేలమంది ప్రజలూ అతి డిసిప్లిన్‌గా ఆమె నృత్య విన్యాస విలాసాలను మూడు గంటలపాటు తిలకించి అభినందించారు. "సినిమా తారగానే భావించాం యిన్నాళ్లూ. ఇంతటి ప్రజ్ఞాధురీణురాలూ నాట్య సరస్వతీ అనుకోలేకపోయాం" అని పరవశించింది ప్రజ. స్థానిక ప్రముఖులు శ్రీ సుంకర వెంకటరెడ్డి శ్రీ కొమరగిరి వెంకట్రావు, శ్రీ లక్ష్మణరావు వగైరాలు ప్రదర్శనలను దిగ్విజయంగా జరిపించి వీడ్కోలు ఇచ్చారు. ప్రజల క్రమశిక్షణకూ, కళాతృష్ణకూ అంజలి ఘటించారు కాగడా శర్మ —

Edited & Published by K. Kameswara Sarma, at 3, Sundaram Iyer St, Madras-17. and Printed by B. V. Krishnaiah at Sri Krishna Chitra Printers, 7, NageswarRao Road, Madras- 7.